సాక్షి
రంగారెడ్డి
శనివారం । 31 । ఆగస్టు । 2024



నిబంధనలు అతిక్రమించొద్దు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. 8లో▸



వ్యాధులపై అప్రమత్తత

సీజనల్ వ్యాధులతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. 8లో▸



శాంతిభద్రతలే ధ్యేయం

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు ముందుకు సాగాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. 8లో▸

నేడు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విష జ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు
డాక్టర్: శ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్
తేదీ: 31.08.2024 (శనివారం)
సమయం: మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73862 17171

ఏరివేతకు రెడీ!

సిద్ధాపూర్ పారిశ్రామికవాడలో నకి'లీలలు'

- భూసేకరణలో భారీగా అవకతవకలు
- 80 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ
- మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం
- అనర్హులుగా తేలితే పరిహారం రికవరీ చేసే యోచన



ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల కోసం సేకరించిన పొలం

సాక్షి, రంగారెడ్డిజిల్లా/కొత్తూరు: ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ యూనిట్ల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. 'తిలా పాపం .. తలా పిడికెడు అన్నట్లు' అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టారు. కేవలం 160 మంది మాత్రమే ఉన్న లబ్ధిదారుల సంఖ్యను.. ఏకంగా 240 మందికి పెంచేశారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ అక్రమార్కులను గుర్తించి, తిన్నది కక్కించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ప్రాథమికంగా గుర్తించిన 80 మంది నకిలీ లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసింది. వీరికి సహకరించిన అధికారులకు కూడా త్వరలో నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

రికార్డులకు మించి నష్టపరిహారం

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గత ప్రభుత్వం 2020లో కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని భావించింది. సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములు మొత్తం 330.34 ఎకరాలను సేకరించి టీజీఐఐసీకి బదలాయించింది. 97.24 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా, 160 ఎకరాలు అసైన్డ్ భూమి ఉంది. మరో 73.1 ఎకరాలు (కొండలు, గుట్టలతో కూడినది) ఖాళీ భూమి కూడా ఉంది. అసైన్డ్‌దారులకు ఎకరానికి రూ.10.50 లక్షలు నష్టపరిహారంగా చెల్లించింది. నిజానికి 160 మంది రైతుల వద్దే భూ రికార్డులు ఉన్నాయి. మిగిలిన వారి వద్ద ఎలాంటి రికార్డులు లేవు. కానీ అప్పటి అధికారులు ఇవేవీ పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు సమర్పించిన లబ్ధిదారుల జాబితాను పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం చెల్లించారు. స్థానికత, సాగు చేసుకుంటున్న రైతులు, ప్రభుత్వం వద్ద ఉన్న భూ రికార్డులతో సంబంధం లేకుండా అనర్హులకు అడ్డగోలుగా చెల్లింపులు చేశారు. ఇలా అంతా కలిసి రూ.16 కోట్లకు పైగా కాజేసినట్లు సమాచారం. దీనిపై అప్పట్లోనే పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. సాగులో ఉన్నప్పటికీ నష్ట పరిహారానికి నోచుకోని రైతులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాలు సైతం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఇదే అంశంపై ఫిర్యాదు చేయగా, ఆయన విచారణకు ఆదేశించారు.

ఇంకా ముగ్గురి చిరునామా దొరకలే..

భూసేకరణ పరిహారంలో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న 80 మందిలో ఈ నెల 14 నుంచి 29 వరకు 77 మందికి నోటీసులు ఇచ్చారు. మరో ముగ్గురి అడ్రస్‌ను గుర్తించలేకపోయారు. నోటీసులు అందుకున్న రైతులు మూడు రోజుల్లోగా తాము పరిహారం పొందిన పొలం, ఇతర వివరాలను రెవెన్యూ అధికారులకు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. రికార్డుల ఆధారంగా రైతులు చెప్పే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పరిహారం పొందిన రైతు అర్హుడా..? కాదా? అనేది తేల్చనున్నారు. ఒకవేళ అనర్హుడిగా తేలితే వారి నుంచి మొత్తం పరిహారాన్ని రికవరీ చేసే అవకాశంతో పాటు వీరికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన నాటి రెవెన్యూ, ఇతరశాఖల అధికారులపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

అర్హులకు దక్కేలా చర్యలు



గత ప్రభుత్వం సిద్ధాపూర్‌లో చేపట్టిన భూసేకరణలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయి. కొందరు నాయకులు కుట్రతో తప్పుడు జాబితాను తయారు చేసి పరిహారాన్ని కాజేశారు. విజిలెన్స్, ఇతర శాఖల అధికారులకు ఫిర్యాదు చేశాం. భూసేకరణపై విచారణ చేసి నష్టపరిహారాన్ని కాజేసిన వ్యక్తుల నుంచి రికవరీ చేసేలా, ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని అర్హులకు అందేలా చూస్తాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే షాద్‌నగర్

సమగ్ర విచారణకు ఆదేశించాం

భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు అంశంపై అనేక ఫిర్యాదులు అందాయి. సమగ్ర విచారణకు ఆదేశించాం. ఇప్పటికే షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం నుంచి పలువురికి నోటీసులు జారీ చేశాం. పూర్తిస్థాయి నివేదిక రావాల్సి ఉంది. ఒకవేళ అనర్హులకు పరిహారం ఇచ్చినట్లు తేలితే..ఇందుకు సహకరించిన అధికారులకు నోటీసులు జారీ చేసి వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశానుసారం నడుచుకుంటాం.

– శశాంక, కలెక్టర్

అన్ని జ్వరాలు డెంగీ కావు

ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

చేవెళ్ల: అన్ని జర్వం కేసులు డెంగీ కావని, ప్రజలు భయపడాల్సిన పనిలేదని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ గదులు, డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగీ, సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. వైద్యం ఎలా అందిస్తున్నారని వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విషజ్వరాలు, డెంగీ కేసులకు సంబంధించి ఆస్పత్రుల్లో వసతులపై పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల ఆస్పత్రిలో టీహబ్ ద్వారా మినీల్యాబ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు భయపడాల్సి పని లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కావాల్సిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, ఆస్పత్రి వైద్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, ఆస్పత్రి హెడ్ నర్స్ స్నేహలత ఉన్నారు.

మొయినాబాద్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

మొయినాబాద్: మొయినాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ మాత్రమే ఉన్నారు. మండల వైద్యాధికారితోపాటు ఇతర సిబ్బంది లేకపోవడంతో కమిషనర్ విస్మయానికి గురయ్యారు. వైద్యాధికారి ఎక్కడికెళ్లారని ఆస్పత్రిలో ఉన్నవారిని అడిగారు. మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహిస్తున్న సమావేశానికి వెళ్లారని చెప్పడంతో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ వెంటనే ఎంపీడీఓ సంధ్యకు ఫోన్ చేసి తెలుసుకున్నారు. వైద్యాధికారి అన్నపూర్ణ, సీహెచ్ఓ వెంకట్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది సమావేశానికి వచ్చారని ఎంపీడీఓ సమాచారం ఇచ్చారు. దీంతో కమిషనర్, అడిషనల్ కలెక్టర్ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు.



చేవెళ్ల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌వీ కర్ణన్

న్యూస్‌రీల్

అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌గా సుదర్శన్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: మండల తహసీల్దార్‌గా సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో ఏడాగా పనిచేస్తున్న ఆయన అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ పనిచేసిన రవీందర్ దత్తు శంషాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రభుత్వ, సీలింగ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల భూములను కాపాడడంతో పాటు ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు.

దృష్టి మళ్లించేందుకే హైడ్రా



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రాను తెరమీదికి తీసుకొచ్చిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. వ్యవసాయాధికారుల వద్ద రైతుల వివరాలు సరిగ్గా లేవని, సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ఆలస్యం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని, అర్హులకు పింఛన్లు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్త పింఛన్ ఇవ్వ లేదని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొందరికే అమలవుతోందన్నారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉందన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, డెంగీ, విషజ్వరాలు విజృంభిస్తున్నా పట్టింపులేదన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్లు మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిని టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డెంగీ, మలేరియా బాధితులకు చికిత్సకు సంబంధించి, ఆస్పత్రిలో సదుపాయాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. టెస్టులు చేసేందుకు కిట్స్, మెడిసిన్, డ్రగ్స్, బెడ్స్ అందుబాటులో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. డెంగీ కేసులు ఆస్పత్రిలో నమోదు కాలేదని చెప్పారు. రోగుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని, అవసరమైనవి తెప్పించుకోవాలన్నారు. ఆస్పత్రి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాధిక, వైద్యులు ముస్రా, కరీం, జయశ్రీ, కీర్తన, వైద్య సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

షాద్‌నగర్: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం, చటాన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ అధికారులు నిర్వహించిన సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. రుణమాఫీ జరగని రైతులను గుర్తించి వారి వివరాలను పూర్తి స్థాయిలో సేకరిస్తున్నామని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో ఏడీఏ రాజారత్నం, మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్, విస్తరణ అధికారులు తేజ్‌కుమార్, గోవర్ధన్, రాంబాబు, ప్రణీత, మాజీ సర్పంచ్ మోబీన్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కొత్తూరు: ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని మల్లాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన రుణమాఫీ కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులను గుర్తించే సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజారత్నం, మండల వ్యవసాయ అధికారి గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్గదర్శకాలను అనుసరించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ శశాంక భక్తులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవాల ఏర్పాట్లపై డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చేనెల 7న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై 17న నిమజ్జనంతో ముగియనున్నాయని చెప్పారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిమజ్జనం కోసం జిల్లాలో 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. శోభాయాత్ర నిర్వహించే దారిలో ప్యాచ వర్క్, ఇతర రిపేర్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మహేశ్వరం డీసీపీ సునితా రెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, ఆర్డీఓలు సూరజ్, సాయిరాం, అనంత రెడ్డి, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికా రులు, ఆర్‌అండ్‌బీ అధికారి, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గొలుసు 'కట్టు' తెగింది!

- మీర్‌పేటలో 'హైడ్రా' గుబులు
- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలపై ఆరా
- కమిషనర్ రంగనాథ్ రాకతో అలజడి
- ఆక్రమణదారులు, అధికారుల్లో మొదలైన ఆందోళన



పెద్ద చెరువు చుట్టూ వెలసిన నిర్మాణాలు

మీర్‌పేట: భారీ వర్షాలకు పోటెత్తే వరద బడంగ్‌పేట్ చెరువు, బాలాపూర్ చెరువు, తాళ్ల చెరువు, ఆల్మాస్‌గూడ చెరువుల మీదుగా మీర్‌పేట్ పెద్ద చెరువుకు చేరుతుంది. అటు నుంచి ఎంఎల్‌ఆర్ కాలనీ, అయోధ్యనగర్, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలను దాటుకుని మంత్రాల చెరువుకు చేరుతుంది. అటు నుంచి మిథులానగర్, సత్యసాయినగర్‌ను ముంచెత్తి చందనచెరువులోకి ప్రవహిస్తుంది. అటు నుంచి మందమల్లమ్మచౌరస్తాలోని ప్రధాన రోడ్డును దాటి, కర్మన్‌ఘట్ మీదుగా సరూర్‌నగర్ చెరువులోకి ప్రవహిస్తుంది. ఇక్కడి చెరువులన్నీ గొలుసు కట్టు మాదిరిగా ఉంటాయి. చెరువులు, కుంటల చుట్టు కాలనీలు రావడం, నిర్మాణాలు వెలియడంతో వాటి పరిధి పూర్తిగా కుంచించుకుపోయింది. గొలుసు కట్టు తెగిపోయింది.

చెరువుల చుట్టూ కాలనీలు

మీర్‌పేట కార్పొరేషన్‌లో ప్రధానంగా మూడు గొలుసు కట్టు చెరువులైన పెద్దచెరువు, మంత్రాల చెరువు, చందన చెరువు ఉన్నాయి. గ్రామాలుగా ఉన్నప్పుడు సాగునీటి అవసరాలు తీర్చిన ఈ మూడు చెరువులు పట్టణీకరణ నేపథ్యంలో ఆక్రమణకు గురై ఉనికి కోల్పోయే దశకు చేరుకుంటున్నాయి. దీనికితోడు కొందరు రాజకీయ నాయకులు చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లను కబ్జా చేసి లేఅవుట్‌లు చేసి చడీచప్పుడు కాకుండా ప్లాట్లుగా చేసి విక్రయించేశారు. దీంతో చె రువుల చుట్టూ పెద్దపెద్ద కాలనీలు వేలసి వందలాది కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇటీవల హైడ్రా దూకుడు చర్యలతో గతంలో చెరువులకు సంబంధించిన స్థలాలని తెలియక ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎక్కడ తమ ఇళ్లను కూల్చివేస్తారోనన్న టెన్షన్‌లో పడ్డారు. చెరువుల బఫర్‌జోన్‌లు, ఎఫ్‌టీఎల్‌లు కబ్జాకు గురైనట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వచ్చి కబ్జాలపై ఆరా తీయడంతో కబ్జాదారుల్లో గుబులు పుట్టుకుంది.

గృహాలు, వాణిజ్య సముదాయాలు

మీర్‌పేట కార్పొరేషన్‌లోని మూడు గొలుసు కట్టు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు 1,200కు పైగా గృహాలు, వాణిజ్య సముదాయాలు వెలిసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అత్యధికంగా పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో 652, మంత్రాల చెరువు పరిధిలో 580, చందన చెరువు ఎఫ్‌టీఎల్‌లో 62 నిర్మాణాలు ఉన్నట్లు సమాచారం.

అధికారుల గుండెల్లోనూ రైళ్లు

ఇన్నేళ్లు యథేచ్ఛగా చెరువుల బఫర్‌జోన్‌లు, ఎఫ్‌టీఎల్‌ను కబ్జా చేసి వ్యాపార సముదాయాలు, ఇళ్లను నిర్మించుకున్న బడాబాబులు, ఆక్రమణదారులకు ప్రస్తుతం హైడ్రా తీసుకుంటున్న చర్యలతో ఆందోళన మొదలైంది. ఎక్కడ తాము ఆక్రమించి నిర్మించుకున్న నిర్మాణాలను కూల్చివేస్తారోనని రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ అనుమతులు ఇవ్వడంతో పాటు వీటిపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే చూసి చూడనట్లు వ్యవహరించారని, ఇటీవల మీర్‌పేటకు వచ్చిన హైడ్రా కమిషనర్‌కు ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయగా కమిషనర్ అధికారులపై కన్నెర్ర చేశారు. ఈ నేపథ్యంలో తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఇక్కడ పనిచేసిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నా యని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే చెరువుల పూర్తి విస్తీర్ణం, కబ్జాకు గురైన విస్తీర్ణం, వెలిసిన నిర్మాణాలు, వాటికి అనుమతులు జారీ చేసిన అధికారుల వంటి సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాల్సిందిగా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించడంతో ఆయా విభాగాల అధికారుల్లో అలజడి మొదలైంది.

హైడ్రా ఆదేశాల ప్రకారం..

కార్పొరేషన్ పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిసి గుర్తించాలని హైడ్రా కమిషనర్ ఇప్పటికే ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు వచ్చిన వెంటనే ప్రక్రియను ప్రారంభించి నివేదిక అందజేస్తాం.

– జ్ఞానేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్



చందన చెరువు చెంత వెలసిన నిర్మాణాలు



మంత్రాల చెరువు చుట్టూ కట్టడాలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో అధికారులు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈగలు, దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. గుంతల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఎక్కువగా జ్వరాలు వస్తున్న గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని ఏఎన్ఎంలకు సూచించారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బన్సీలాల్, డాక్టర్లు నాగేంద్రబాబు, హరికిషన్, స్రవంతి, అమృత, జోసెఫ్, నికిత, రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సీహెచ్ఓ నాగేష్, శ్రావణ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, అమృత, సువర్ణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బాలికపై లైంగిక దాడి
ఘటనలో కోర్టు తీర్పు వెల్లడి


శివాజీ (ఫైల్)

కందుకూరు: ప్రేమ పేరుతో ఓ బాలికను మభ్యపెట్టి లైంగికంగా వేధించి, అనంతరం వివాహం చేసుకున్న ఘటనలో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం సీఐ సీతారాం విలేకరులకు వెల్లడించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కన్నాయిపల్లికి చెందిన ఇరగదిండ్ల శివాజీ(20) 2017 సంవత్సరంలో కందుకూరు మండలం వాచ్చిళ్లకుంటతండా సమీపంలోని పవర్‌గ్రిడ్ వద్ద కూలి పనులు చేయడానికి వచ్చాడు. కాగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ బాలిక(16) కుటుంబం కూడా అదే ప్రాంతంలో కూలి పనులు చేసుకుంటుంది. శివాజీ 2017 ఫిబ్రవరి 11న రాత్రి సమయంలో ఆ బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. అనంతరం ఓ దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పట్లో అతడిపై కందుకూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక, పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. సుదీర్ఘంగా విచారించిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివాజీని దోషిగా నిర్ధారిస్తూ జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించారు. బాధితురాలికి నష్ట పరిహారం కింద రూ.5 లక్షలు ప్రభుత్వం అందించాలని తీర్పులో ఆదేశించారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య

యాచారం: వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన కర్రె మదారు(50) కొద్ది రోజులుగా వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తన వ్యవసాయ పొలం వద్దే గురువారం రాత్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో కూడా మదారు మూడుసార్లు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా.. దూసుకొచ్చిన మృత్యువు

ఆర్టీసీ బస్సు ఢీకొని
వృద్ధురాలి దుర్మరణం

కొత్తూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి నాట్కో కూడలి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. పట్టణంలో నివాసం ఉంటున్న జహంగీర్‌బీ(60) ఉదయం నాట్కో కూడలిలో రోడ్డు దాటుతుంది. అదే క్రమంలో హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్తున్న హైదరాబాద్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ప్రమాదంపై మృతురాలి కుమారుడు బురాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

- ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి
- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి


శేరిగూడ చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి తదితరులు

ఇబ్రహీంపట్నం: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సూచించారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వాహకుల కమిటీ సమావేశాన్ని శుక్రవారం స్థానికంగా ఓ గార్డెన్‌లో నిర్వహించారు. అంతకు ముందు శేరిగూడ చెక్ డ్యాంను పరిశీలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూ.15 లక్షలతో 50 సీసీ కెమెరాలతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఆమె ప్రారంభించారు. అదేవిధంగా అంబేడ్కర్ చౌరస్తా సందర్శించి ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు తీసుకునే చర్యలపై పోలీసులతో చర్చించారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అర్ధరాత్రి వరకు మైక్ సౌండ్ పెట్టొద్దని సూచించారు. 11 రోజుల్లో గణేశ నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. పోలీసుల నిబంధనలను అనుసరించి ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకొనేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ప్రత్యేక యాప్‌తో ఆన్‌లైన్ ఇంటిమేషన్‌ను ఉత్సవ నిర్వాహకులు ఇవ్వాలని కోరారు. నిమజ్జనం చేసే చెక్ డ్యాం వద్ద క్రేన్‌లను, లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు.

పోలీసులకు ఉపయోగం

నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమన్నారు. గతంలో ఉన్న 40 తోపాటు కొత్తగా ఇబ్రహీంపట్నం 44, శేరిగూడల ఆరు చొప్పున 18 లోకేషన్లలో కెమెరాల ఏర్పాటు చేయడంతో నిఘా వ్యవస్థ పటిష్ఠంగా మారిందన్నారు. కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు సత్యనారాయణ, బాబ్యానాయక్, నర్సింహ, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ రవీందర్, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

శంషాబాద్ డీసీపీ రాజేశ్


రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ, ఏసీపీ

తలకొండపల్లి: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు ముందుకు సాగాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందజేసేలా కృషి చేయాలన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామితో కలిసి ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలతో పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. హత్యలు, హత్యాయత్నాలు, ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. కొత్త చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. భూ వివాదాలు, పాత గొడవలు, మొదలైన వాటిని గుర్తించి, నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్స్, హోటళ్ల వద్ద నిఘా వ్యవస్థ పటిష్ఠం చేయాలన్నారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

నందిగామ: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రమైన నందిగామ శివారులోని పృథ్వీకాలనీలో నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని కిరణా షాపులను, ద్విచక్రవాహనాలను తనిఖీలు నిర్వహించి పలు కిరాణా షాపుల నుంచి గుట్కా ప్యాకెట్లు, మద్యం కాటన్లు, సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్ఐలు గోపాల కృష్ణ, తిరుపతిరావు, 6గురు ఏఎస్సైలు, 50 మంది పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధులకు వెళ్తూ.. అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో
విద్యుత్ ఉద్యోగి దుర్మరణం


అశోక్ (ఫైల్)

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామానికి చెందిన అశోక్(58) వికారాబాద్ జిల్లా తాండూరులో విద్యుత్ శాఖలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి డ్యూటీ కోసం తాండూరుకు కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీ వద్ద అతివేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కొత్తూరు: మాటమాట పెరిగి హోటల్ వద్ద ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని ఇన్ముల్‌నర్వ సమీపంలో ఉన్న జేపీ దర్గా ఆవరణలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దర్గా ఆవరణలోని ఓ హోటల్ వద్ద ఫయాజ్, రఫీక్‌లు ఓ విషయమై చర్చించుకుంటున్న సమయంలో మాటలు పెరిగి ఘర్షణకు దారి తీశాయి. దీంతో ఇరు వర్గాలకు చెందిన పలువురు వ్యక్తులు ఒకరినొకరు నెట్టుకుంటూ దాడి చేసుకున్నారు. ఈ ఘటనపై రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నర్సింహారావు తెలిపారు. దాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

షట్టర్ తాళం పగలగొట్టి.. షాపులో చోరీ

కేశంపేట: బంధువుల ఇంట్లో బోనాలు ఉండటంతో కిరాణ షాపునకు తాళం వేసి వెళ్లగా.. దుండగులు షాపులో దూరి నగదు అపహరించుకుపోయిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన సొప్పరి నర్సింహ గ్రామంలో కిరాణషాపును నిర్వహిస్తున్నాడు. ఆయన బంధువుల గ్రామమైన కుర్మిదలో బోనాలు ఉండటంతో కుటుంబ సమేతంగా షాపునకు తాళం పెట్టి గురువారం వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు రాత్రి వేళలో కిరాణషాపు తాళాన్ని ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించి నర్సింహకు శుక్రవారం ఉదయం తెలిపారు. నర్సింహ వచ్చి చూడగా షాపులో ఉన్న రూ.35 వేల నగదు తస్కరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

అత్తాపూర్: తన రోగం నయం కాదని ఆసుపత్రిలో ఉన్నా లాభం లేదనుకుని ఉస్మానియా ఆస్పత్రి నుంచి తప్పించుకుని వచ్చిన ఓ వృద్ధుడు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై ఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, బాలనగర్ మండలం, ఒడిత్యాల గ్రామానికి చెందిన యాదయ్య(60) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వారం రోజుల కింరతం కుమారుడు యాదయ్య, కోడలు మాధవి అతడిని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న యాదయ్య తన రోగం నయం కాదని, చనిపోవటమే మేలని భావించి ఆసుపత్రి నుంచి తప్పించుకుని వచ్చి పీవీ నర్సింహారావు ఫ్లై ఓవర్ పైకి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లర్ నెంబర్ 162 వద్ద కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు తిరిగి ఉస్మానియా ఆసుపత్రికే చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మా ఆదేశాలనే అమలు చేయరా?

- నేరుగా హాజరై వివరణ ఇవ్వండి
- కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించి గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హరితకు ఫారమ్-1 నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ, విచారణ సెప్టెంబర్ 27కు వాయిదా వేసింది. జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై తాము దాఖలు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయడంలో కమిషనర్ ఫర్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యాన్ని సవాల్ చేస్తూ జూబ్లీహిల్స్ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. 2022, మార్చి 23న సమర్పించిన విచారణ నివేదికను పిటిషనర్‌కు రెండు వారాల్లో అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే, కోర్టు ఆదేశాలు జారీ చేసి నాలుగు నెలలు దాటినా కో ఆపరేటివ్ అధికారులు ఇప్పటికి అమలు చేయడం లేదంటూ మురళీ ముకుంద్ హైకోర్టులో ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అరువ రఘురాం వాదనలు వినిపిస్తూ.. జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ సొసైటీపై ఇలాంటి ఫిర్యాదులు చేసిన వారు 60 మంది వరకు ఉంటారని, వీరంతా నివేదిక కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

రహమత్‌నగర్ : ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చర్లపల్లి జైలులో రిమాండ్ ఉన్న ప్రశాంత్(35)కు మానసిక స్థితి సరిగా లేక పోవడంతో అతడిని చికిత్స నిమిత్తం ఈ నెల 28న ఎర్ర గడ్డలోని మానసిక ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం అతను డైనింగ్ హాల్ తలుపు కొక్కానికి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

తప్పించుకోబోయి.. రెండో అంతస్తు నుంచి దూకి

ఫేక్ సర్టిఫికెట్‌ల కేసులో నిందితుడి మృతి

రాజేంద్రనగర్: పోలీసులు అరెస్టు వారెంట్ తీసుకుని రావడంతో వారి తప్పించుకునే క్రమంలో ఫేక్ సర్టిఫికెట్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి రెండో అంతస్తు నుంచి కిందకు దూకి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. టోలిచౌకి ప్రాంతానికి చెందిన అప్సరుద్దీన్ (60) నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఫేక్ సర్టిఫికెట్ల కేసులో నిందితుడుగా ఉన్నాడు. పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఫేక్ సర్టిఫికెట్ లో అరెస్ట్ వారెంట్ పెండింగ్ లో ఉంది. అప్సరుద్దీన్ కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య టోలిచౌకిలో ఉండగా రెండో భార్య రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్ సిటీలో నివాసముంటోంది. అప్సరుద్దీన్ సన్ సిటీలోని నివాసంలో ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం సాయంత్రం పంజగుట్ట పోలీసులు అరెస్ట్ వారెంట్‌తో రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ఇంటి గేటు బయట నిలబడి అప్సరుద్దీన్ కోసం వచ్చినట్లు చెబుతుండగానే పోలీసుల రాకను ముందే పసిగట్టిన వారి నుంచి తప్పించుకునేందుకు అతను రెండో అంతస్తు నుండి కిందికు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాంనగర్‌లో కూల్చివేతలు


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: అక్రమ కట్టడాలపై 'హైడ్రా' చేపట్టిన చర్యల్లో భాగంగా జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ 15 పరిధిలోని రాంనగర్ చౌరస్తా సమీపంలోని మణెమ్మ గల్లీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. మణెమ్మ గల్లీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు మేరకు అధికారులు 48 గంటల్లో అక్రమ కట్టడాలను కూల్చివేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే... రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో రోడ్డు, నాలాను ఆక్రమించి కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో గల్లీలో వర్షపునీరు బయటికి వెళ్లకపోవడంతో తాము గత కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గత మంగళవారం అసోసియేషన్ నేతలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన బుధవారం సాయంత్రం జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి మణెమ్మ గల్లీలో పర్యటించారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ రికార్డులు, స్థానికుల ఇళ్ల డాక్యుమెంట్లు పరిశీలించి తనకు నివేదిక అందజేయాలని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వారు అందజేసిన నివేదికను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రోడ్డు, నాలాను ఆక్రమించి చేపట్టిన కట్టడాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు పలు కట్టడాలను కూల్చివేశారు. దీంతో అధికారులు బాధితులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కూల్చివేతలను టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ హఫీజ్, హైడ్రా అధికారులు రోహిత్‌రెడ్డి, ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

బాధితుల ఆందోళన...

రాంనగర్ చౌరస్తా మణెమ్మ గల్లీలో కూల్చివేతల నేపథ్యంలోనే ఉద్రిక్తత నెలకొంది. కూల్చివేతలను అడ్డుకునేందుకు బాధిత కుటుంబాలు ప్రయత్నించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపడితే తాము ఉన్న ఫలంగా ఎక్కడికి వెళ్లాలని బాధిత కుటుంబాల మహిళలు అధికారులను నిలదీశారు. నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల కుటుంబాలను ఎలా కూల్చివేస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ యాదవ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.